# మూడోసారి విజయం సాధిస్తా..

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు
- దారి పొడవునా డప్పుల చప్పుళ్లు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం



నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ నవంబర్ 9: బ్రహ్మాండమైన మెజార్టీతో మూడోసాని విజయం సాధిస్తానని సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. గురువారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఆయన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ముందుగా వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో వివిధ ఆలయాల పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం తన తల్లి తలసాని లలితాబాయి కాళ్లకు మొక్కి ఆమె ఆశీర్వాదం పొందారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుంచి బన్సీలాల్‌పేట్‌లోని జబ్బార్ కాంప్లెక్స్ వద్దకు చేరుకోని అక్కడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అక్కడి నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వేలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి మారేడ్‌పల్లిలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు.

**దారిపొడవునా కార్యకర్తల కోలాహలం..**

జబ్బార్ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన నామినేషన్ ర్యాలీ సిటీలైట్ హోటల్, బాటా, ప్యాట్నీ హరిహార కళా భవన్‌ల మీదుగా నార్త్‌జోన్ జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. దారిపొవడవునా కార్యకర్తల నినాదాలు, డప్పు చప్పుళ్లతో ఎంతో కోలాహలం నెలకొన్నది. ర్యాలీలో రెండు చోట్ల అభిమానులు గజమాలలను భారీ క్రేన్‌తో మంత్రికి అలంకరించారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదన్నర ఏండ్లలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడపడుచుల పెండ్లికి లక్ష నూట పదహార్లు ఆర్థిక సహాయం, ఆసరా పథకంలో ప్రతి నెల ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. దళిత బంధు, బీసీ బంధు, ఇండ్లు లేని వారికి ఉచితంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇవ్వడం వంటి అనేక కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో 70 వేల మంది అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. 30 వేల ఇండ్లు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మరో లక్ష ఇండ్లు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన అన్ని కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్‌లు మహేశ్వరి, కొలన్ లక్ష్మి, హేమలతా, మాజీ కార్పొరేటర్‌లు అరుణాగౌడ్, శే షుకుమారి, బీఆర్ఎస్ నాయకులు పవన్‌కుమార్‌గౌడ్, అత్తెలి శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, వెంకటేశం రాజు, బేగంపేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.





తలసాని శ్రీనివాస్‌యాదవ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు



మంత్రి తలసానికి మద్దతుగా భోలక్‌పూర్ నుంచి ర్యాలీగా తరలివెళ్లిన మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, నాయకులు ఏసూరి మహేశ్, మహేందర్, నాగలక్ష్మి తదితరులు (బన్సీలాల్‌పేట్)

## యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలి



ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శంకర్‌రాజు దవాఖాన సిబ్బంది

బేగంపేట్ నవంబర్ 9 : యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకొని వాహనాలను నడపాలని బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. గురువారం బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో కిమ్స్ దవాఖాన ప్రాంగణంలో 350 మంది దవాఖాన సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ఏసీపీ పాల్గొని మాట్లాడుతూ.. రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, ట్రాఫిక్ పోలీస్ అధికారులు నియంత్రణ చేస్తున్నప్పుడు వారికి సహకరించాలని సూచించారు. యువత వాహనాలు వేగంగా నడిపి ట్రాఫిక్ నిబంధనలు తెలియక ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రోడ్లపై వాహనాలు నడిపే వారు క్రమశిక్షణతో నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని చెప్పారు. యువత 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే లైసెన్స్ పొంది వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధులు భరత్‌కాంత్ రెడ్డి, సాయిబాబా, శంకర్‌రావ్ పాల్గొన్నారు.

## అమీర్‌పేట్ దవాఖాన తనిఖీ..



దవాఖానలో తనిఖీనిర్వహిస్తున్న కమిషనర్ డాక్టర్ అజయ్

అమీర్‌పేట్, నవంబర్ 9 : అమీర్‌పేట్‌లోని 50 పడకల దవాఖానలో పేదలకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించేందుకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ గురువారం ఉదయం దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాలతో పాటు ఇన్‌పేషెంట్ల వార్డులను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలను నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్ పాల్గొన్నారు.

# పచ్చదనానికి చిరునామాగా సనత్‌నగర్

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో పార్కులకు కొత్త అందాలు

అమీర్‌పేట్/బేగంపేట్: నవంబర్ 6: ఎండిపోయిన గడ్డి, చెత్త కాగితాలు, పిచ్చి మొక్కలతో నిండి పోయిన పార్కులు అసాంఘీక కార్యాకలాపాలకు నిలయంగ ఉండేవి. అలాంటి పార్కులు ప్రస్తుతం పచ్చటి పచ్చిక బయళ్లు, ఒపెన్ జిమ్‌లు, పిల్లలు ఆడుకుకునేందుకు వీలుగా పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లతో నిత్యం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో సనత్‌నగర్ డివిజన్ ఇండస్ట్రియల్ సబ్సిడైజ్డ్ హౌసింగ్ కాలనీకి ఓ ప్రత్యేకత ఉంది. 1950 దశకంగా నిర్మితమైన ఈ కాలనీ సనత్‌నగర్ పారిశ్రామికవాడకు ఆనుకుని ఉంటుంది. ఈ పారిశ్రామికవాడతో పాటు నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికుల కోసం కేటాయించారు. దాదాపు 1500 క్వార్టర్లు నిర్మించడమే ఒక ప్రత్యేకత అయితే... ఇక్కడి పారిశ్రామిక కాలుష్యాన్ని తట్టుకునేందుకు వీలుగా మొత్తం 52 పార్కులతో పాటు ప్లే గ్రౌండ్ల నిర్మాణాలు జరిగాయి. అయితే గత ఆరున్నర దశాబ్దాలుగా పాలకులు ఈ ఉద్యానాలను, ప్లే గ్రౌండ్లను నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత దశాబ్ద కాలంలో ఈ ఉద్యానాలకు ఊ హించని విధంగా ప్రాముఖ్యతనిస్తూ... ని ర్మించిన మల్టీ జనరేషన్ థీమ్ పార్కు ఎస్ఆర్‌టీ ప్రజల జీవితంలో భాగంగా మారింది.

**ఓపెన్ జిమ్‌లు, యోగా హాల్..**

సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో పార్కులు సరికొత్త సొబగులు అద్దుకున్నాయి. ఉద్యానాలలో ఓపెస్ జిమ్‌లు ఏర్పాటు చేయడంలో మంత్రి తలసాని కృషి మరువలేనిది. సనత్‌నగర్‌లోని కేఎల్ఎన్ స్మారక పార్కులో యోగా హాలును కూడా నిర్మించి ఇచ్చారు.

**రెండు పార్కు ఉత్తమ ఉద్యానవనంగా ..**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ఉద్యానాల విభాగం 7వ గార్డెన్ ఫెస్టివల్, మొదటి అర్బన్ ఫామింగ్ ఫెస్టివల్ 2023లో ఉత్తమ ఉద్యానవనాల ఎంపికలో సనత్‌నగర్ మోడల్ కాలనీ పార్కుకు మొదటి బహుమతి లభించింది. మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పార్కు నిర్వహణకు అధికారులు నుండి మంచి మార్కులు లభించడంతో కాలనీ నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




పార్కులో ఏపుగా పెరిగిన పచ్చని మొక్కలు

**పార్కుల అభివృద్ధికి ఎనలేని కృషి**

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రజల కోరిక మేరకు అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థులు, యువకులకోసం పార్కులలో ఓపెన్‌జిమ్‌లను కూడా ఏర్పాటు చేశాం. – మంత్రి తలసాని


దేవాదాయ-ధర్మాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం



**శ్రీ వీర హనుమాన్ దేవాలయం**
ఎస్.పి. రోడ్, సికింద్రాబాద్, Email: svhtsproad@gmail.com

Ref. No. 4/SVHT/2023, **బహిరంగ వేలం ప్రకటన** తేది: 09-11-2023

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, శ్రీ వీర హనుమాన్ దేవస్థానం, ఎస్.పి.రోడ్, సికింద్రాబాద్ ప్రాంగణంనందు వ్యాపారం చేసుకొనుటకు వీలగు షాపులు (3) సం||ల కాలపరిమితికి లీజుకు ఇచ్చుటకుగాను **తేది: 18-11-2023 రోజున శనివారం మ|| 03.00 గంటలకు** దేవస్థానంయందలి మండపంనందు బహిరంగ వేలం నిర్వహించబడును. కావున, ఆసక్తిగలవారు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి సమర్పించి ఆలయ షరతులకు లోబడి ఇట్టి వేలంలో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర.సం. | వేలం వివరములు | వేలం పాట కాలపరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|
| 1 | షాపు నెంలు. 9, 10 | 20-11-2023 నుండి 19-11-2026 | రూ. 50,000 |
| 2 | షాపు నెం. 6 | 10-12-2023 నుండి 09-12-2026 | రూ. 50,000 |

ఇతర వివరాలకు కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- **కార్యనిర్వహణాధికారి, శ్రీ వీర హనుమాన్ దేవాలయం, ఎస్.పి. రోడ్, సికింద్రాబాద్.**